క్లుప్తంగా

కొలువుదీరిన మౌలాలి స్వామిపీరు



పీర్ల చావిడిలో కొలువు దీరిన మౌలాలిస్వామి

పాములపాడు: మండల కేంద్రంలో శుక్రవారం మౌలాలిస్వామి పీరు కొలువు దీరారు. రాత్రి స్వామి వారిని పీర్లచావిడిలో ఏర్పాటు చేసే ససమయంలో డప్పుల హోరు, సాంబ్రాణి, అగరవత్తుల సువాసనలు, పూల షేరాలతో స్వామి వారిని అలంకరించారు. స్వామి వారిని పీర్ల చావిడిలో ఏర్పాటు చేసిన తదనంతరం భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి దర్శనం చేసుకున్నారు. 40 రోజుల తర్వాత స్వామి వారికి చిన్న, పెద్ద సరెగెత్తు వేడుకలు నిర్వహించనున్నట్లు కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ఊరంతా ఆరోగ్యంగా ఉండాలి



చెలిమిల్లలో డ్రైడే, ఫ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాములపాడు: ప్రతి ఒక్కరూ రోగ్యం పట్ల శ్రద్ధ వహించి, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఊరంతా ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీడీఓ గోపీకృష్ణ అన్నారు. శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఇంటింటికి మరుగుదొడ్డి వినియోగించుకోవాలని సూచించారు. మండలంలోని లింగాల, చెలిమిల్ల గ్రామాల్లో కూడా ర్యాలీ నిర్వహించారు.

అభివృద్ధి పనులకు భూమి పూజ

నందికొట్కూరు రూరల్: మండలంలోని దామగట్ల గ్రామంలో శుక్రవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సర్పంచ్ మాధవరం సుశీలమ్మ భూమి పూజ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించిందని, వీటి ద్వారా గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలను నిర్మించనున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్ డీఈ దానయ్య, ఏఈ ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

షడ్రక్ ఆశయాలను సాధిద్దాం

ఆత్మకూరు: ప్రజాసేవకే తమ జీవితాలను అంకితం చేసిన షడ్రక్, సున్నం రాజయ్యను ఆదర్శంగా తీసుకుందామని సీపీఎం నాయకుడు రాంనాయక్ అన్నారు. శుక్రవారం 3వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాలులర్పించారు. పట్టణ కార్యదర్శి రణధీర్, నరసింహనాయక్, సుధాకర్, జోషఫ పాల్గొన్నారు.

పాములపాడు: కామ్రెడ్ షడ్రక్ ఆశయాల కోసం పని చేయాలని సీపీఎం మండల కార్యదర్శి స్వామన్న కోరారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో షడ్రక్ వర్ధంతిని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మధు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

పగిడ్యాల: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అధ్యక్షతన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ చెత్తచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారవేయరాదని సూచించారు.

ఎస్‌ఐకి సన్మానం

మహానంది: గాజులపల్లెలో మౌలాలిస్వామి జార్తలు అందరి సహకారంతో విజయవంతమయ్యాయని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్దలు గజ్జ పెద్దరామసుబ్బయ్య, టపా ఎర్రమద్దిలేటి, ముజావర్ ఇబ్రహీం శుక్రవారం మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్‌ను కలిసి సన్మానించారు. వారు మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహించారని అభినందించారు. గత కొన్నేళ్లుగా ఉత్సవాలు విజయవంతం కావడంతో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు.

పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి ఎన్నిక

మహానంది: పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శిగా భాష్యం రాజశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామపక్కీర్‌రెడ్డి, దేవనాల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఇటీవల ఉపాధ్యాయుల బదిలీల అనంతరం ఖాళీగా ఉన్న స్థానాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామన్నారు. మండల అసోసియేట్ అధ్యక్షుడిగా సి.మద్దిలేటి, మహిళా కార్యదర్శులుగా సాయిమణిమాల, కోటేశ్వరమ్మను ఎన్నుకున్నట్లు చెప్పారు. మండల అధ్యక్షుడిగా తులసీఈశ్వర రెడ్డి కొనసాగుతున్నారని పేర్కొన్నారు.

చిరువ్యాపారులకు తోడుగా

చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తిదారులకు రూ.పది వేల వరకు వడ్డీలేని రుణం అందించేందుకు ప్రభుత్వం జగనన్న తోడు పథకం అమలు చేస్తుంది. ఈ పథకం కింద చిరు వ్యాపారులతో పాటు బొమ్మల తయారీ, కలంకారీ పనులు, తోపుడు బండ్ల మీద వ్యాపారం చేసే వారికి ఏటా రూ.10వేల వరకు వడ్డీ లేని రుణం అందజేస్తారు. అధిక వడ్డీ రేటుతో ఇబ్బందులు పడుతున్న చిరు వ్యాపారులను ఆదుకోవడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని ఇటీవల ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసింది.

- ఉపాధికి ఊతమిచ్చేందుకు 'జగనన్న తోడు' కింద ఆర్థిక సాయం
- లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో రూ.10వేల చొప్పున జమ
- నియోజకవర్గంలో 3007 మంది లబ్ధిదారులకు రూ.30.7 కోట్లు

నందికొట్కూరు: జగనన్న తోడు పథకం అమలుతో రాష్ట్ర ప్రభుత్వం చిరు వ్యాపారుల ఉపాధికి ఊతం ఇచ్చింది. చిరు వ్యాపారులను వడ్డీ వ్యాపారుల బారి నుంచి కాపాడేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏడో విడత జగనన్న తోడు పథకం డబ్బులను ఇటీవల లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. నియోజకవర్గంలో 3,007 మందికి రూ.30.7 కోట్లు అందాయి. ఈ పథకం ద్వారా గతంలో తీసుకున్న డబ్బులు సకాలంలో చెల్లించిన వారికి ఏటా రూ.10 వేలకు ఒక్కొక్కరికీ వడ్డీ రాయితీ రూ.వెయ్యి చొప్పున్న ప్రభుత్వం రూ.3 లక్షల వరకు అందజేసింది.

రుణం తీర్చిన వారికి మళ్లీ రుణం..

జగనన్న తోడు పథకం కింద రుణం తీసుకొని.. ఆ మొత్తాన్ని వడ్డీతో సహా సకాలంలో బ్యాంకులకు చెల్లిస్తే.. ఆ వడ్డీని లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వమే నేరుగా జమ చేస్తుంది. రుణం తీర్చిన వారికి బ్యాంకులు మళ్లీ రుణం మంజూరు చేస్తాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అర్హులకు రుణాల ఇచ్చే కార్యక్రమం జరుగుతుంది.

ఆర్థిక ఇబ్బందులు తొలిగాయి

ఫొటోలో కిరాణా దుకాణం నిర్వహించుకుంటున్న మహిళ పేరు ఈడిగ జ్యోతి కొత్తపల్లి మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామ నివాసి. జగనన్న తోడు పథకం కింద మంజూరైన వడ్డీ లేని రుణంతో కిరాణా దుకాణం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తోంది. మూడేళ్లుగా పథకం సొమ్ము అందుకొని వ్యాపారాన్ని పెంచుకొంది. సరుకుల ఖర్చు పోనూ రోజుకు రూ.400 వరకు మిగులుతుందని, ఈ మొత్తంతో తమ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు తప్పాయని పేర్కొంటుంది.



మా కుటుంబం సంతోషంగా ఉంది



కూరగాయల వ్యాపారం చేసుకుంటూ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. జగనన్న తోడు పథకం కింద వచ్చిన సొమ్ముతో వ్యాపారం అభివృద్ధి చేసుకున్నా. నాకు ఒంటరి మహిళా పింఛన్ వస్తుంది. ప్రభుత్వం వడ్డీలేని రుణం ఇచ్చి చిరు వ్యాపారులను ఆదుకోవడం అభినందనీయం.

– లక్ష్మి, నందికొట్కూరు పట్టణం, కూరగాయల వ్యాపారం

వడ్డీల బాధ తప్పింది



జగనన్న తోడు పథకం ద్వారా వచ్చిన డబ్బులతో కుట్టు మిషన్ తెచ్చుకుని బట్టలు కుట్టి కుటుంబాన్ని పోషించుకుంటున్నా. వరుసగా మూడోవ సారి కూడా డబ్బులు నా బ్యాంకు ఖాతాలో జమయ్యాయి. జగనన్న ఇచ్చిన డబ్బుతో ఇంటి వద్దే టైలరింగ్ చేస్తూ కుటుంబ పోషణలో చేదోడుగా ఉంటున్నా.

– లత, కుట్టు మిషన్, మిడుతూరు మండల

మండలాల వారీగా జగనన్న తోడు పథకం లబ్ధిదారులు, జమయిన సొమ్ము వివరాలు..

మండలం	లబ్ధిదారులు	జమైన సొమ్ము
నందికొట్కూరు టౌన్	645	రూ.6.45 కోట్లు
నందికొట్కూరు రూరల్	467	రూ.4.67 కోట్లు
మిడుతూరు	175	రూ.1.75 కోట్లు
జూపాడుబంగ్లా	319	రూ.3.19 కోట్లు
పగిడ్యాల	350	రూ.3.50 కోట్లు
కొత్తపల్లి	472	రూ.4.72 కోట్లు
పాములపాడు	579	రూ.5.79 కోట్లు
మొత్తం	3007	రూ.30.7 కోట్లు

నవరత్నాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- నల్లకాల్వలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఆత్మకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నల్లకాల్వ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి బుక్‌లెట్ అందజేసి అందిన పథకాలు, లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను తెలుసుకోవడం కోసం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, గతంలో ఇలాంటి కార్యక్రమం చేపట్టిన ప్రభుత్వాలు లేవని చెప్పారు. అర్హులందరికీ పథకాలు అందజేయడంలో జగనన్న దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. కొన్నింటికి అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకుల నుంచి ఘన స్వాగతం లభించింది. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ శివశంకరరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, సర్పంచు వెంకటరమణ, ఎంపీటీసీ శాంతమ్మ, నాయకులు ద్రోణారెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసగౌడు, ఎల్లయ్య, వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సయ్యద్‌మీర్, మార్కెట్ యార్డు చైర్మన్ బాలస్వామి, సుల్తాన్, లక్ష్మిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, ఎంపీడీఓ మోహన్‌కుమార్, తహసీల్దార్ ఉమాదేవి, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఈలు ఉమామహేశ్వరరెడ్డి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- మిడుతూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

మిడుతూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గడప గడపకూ సంక్షేమం అందుతోందని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. శుక్రవారం మిడుతూరు -1 గ్రామ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. అలాగే ప్రజా సమస్యలను అడిగి తెసులుకున్నారు. గ్రామంలో పలు కాలనీల్లో సీసీ రహదారులు, డ్రైనేజీలు, విద్యుత్ , తదితర సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఆదర్శ పాఠశాలకు రోడ్డు ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ సలీం బాషా విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీరాజ్ నిధులు, సమగ్ర శిక్ష పథకం కింద మంజూరుచేసేందుకు కృషిచేస్తానని చెప్పారు.

నవరత్నాలతో పేదల జీవితాలలో వెలుగు

ప్రజా సంకల్పపాదయాత్రలో ఇచ్చిన హామీలలో 99 శాతం నెరవేర్చిన జగన పాలన స్వర్ణయుగం తలపిస్తుందని ఎమ్మెల్యే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగుతుందన్నారు. అనంతరం బీసీ కాలనీ, బస్టాండు సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను ఎమ్మెల్యే తనిఖీ చేశారు. బీసీ కాలనీ అంగన్ వాడీ కేంద్రానికి నాడు– నేడు కింద నూతన భవనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామంలో రేషన్ పంపిణీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ఎస్‌రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్ బాబు, పీఆర్ డీఈ ధనిబాబు, రూరల్ సీఐ సుధాకర్ రెడ్డి, ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ షుకూర్, కిసాన్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగాల సిద్ధారెడ్డి, నందికొట్కూరు సింగిల్ విండో చైర్మన్ ఉశేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

7న మెగా జాబ్‌మేళా

నందికొట్కూరు: ఈ నెల 7వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తునట్లు బసిరెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ తెలిపారు. గురువారం పట్టణంలోని కళాశాల ఆవరణలో పోస్టర్లను ప్రిన్సిపాల్ జాన్ ఏలీషా, డైరెక్టర్ సరళా దేవి, చైర్మన్ శ్రీధర్‌రెడ్డితో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలలో ఫైనలియర్ పూర్తయిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేశామని చెప్పారు. 10వ తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, డిగ్రీ, బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ బీఈ, బీటెక్, ఎంబీఏ, పీజీ చేసిన వారిని ఆయా కంపెనీలు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులను ఎంపిక చేసుకుంటారని వివరించారు.

స్వచ్ఛమైన గ్రామాలుగా మార్చుదాం

మహానంది: స్వచ్ఛమైన గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివనాగజ్యోతి తెలిపారు. స్వచ్ఛసర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంలో భాగంగా తిమ్మాపురం సర్పంచ్ కల్లె శ్రీలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు స్వరూప ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.

సచివాలయాల తనిఖీ

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ 1,2 సచివాలయాలను ఎంపీడీఓ వెంకటరమణ శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఆదేశించారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. పాలనపరమైన అంశాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈఓఆర్డీ నాగేంద్రయ్య, పంచాయతీ కార్యదర్శి వీరన్నయాదవ్, సచివాలయ కార్యదర్శి మల్లికార్జున ఉన్నారు.

ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయండి



పీవీ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దిలీప్‌రాజు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలో ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్, అంబేడ్కర్ ఇండియన్ మిషన్ వ్యవస్థాపకుడు పీవీ సునీల్‌కుమార్‌ను జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్‌రాజు కోరారు. శుక్రవారం నంద్యాలకు వచ్చిన ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసే పోలీసు అనుబంధ రంగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించాలన్నారు. మాలమహానాడు నాయకులు ఆర్ ఎంపీ రాజు, నగేష్, దేవసహాయం, పరశురాముడు, సుబ్బన్న పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం వెళ్లి పింఛన్ అందజేత



ఎర్రగొండపాలెంలో చికిత్సలు పొందుతున్న పిచ్చయ్యకు పింఛన్ అందిస్తున్న వలంటీర్లు



కర్నూలులోని ఆసుపత్రిలో లబ్ధిదారునికి పింఛన్ పంపిణీ చేస్తున్న గ్రామవలంటీర్ దినేష్ బాబు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో నివసిస్తున్న పిల్లి పిచ్చయ్య అనారోగ్య కారణంతో ఎర్రగొండపాలెంలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్లు గూండా వెంకటరమణయ్య, పఠాన్ సాజిద్‌అలీఖాన్ శుక్రవారం అక్కడికి వెళ్లి పింఛన్ అందజేశారు. వలంటీర్లను పంచాయితీ కార్యదర్శి, తహసీల్దార్ అభినందించారు.

కొత్తపల్లి: మండలంలోని ఎర్రమఠం గ్రామ సచివాలయ పరిధిలోని బలపాలతిప్ప గ్రామానికి చెందిన పశువుల నారాయణ గుండెజబ్బుతో కర్నూలులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎర్రమఠం గ్రామ వలంటీర్ మలిరెడ్డి దినేష్‌బాబు అక్కడికి వెళ్లి శుక్రవారం ఆయనకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

98.56 శాతం పింఛన్ల పంపిణీ

పాములపాడు: మండలంలో 98.56 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 5,682 పింఛన్లు ఉండగా గ్రామాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది 5,600 మందికి పింఛన్లు అందజేశారని చెప్పారు. ఇంకా 82 పెండింగ్ ఉన్నాయని, వారు ఇతర ప్రాంతాల్లో ఉన్నందున పంపిణీ చేయలేకపోయామన్నారు.త్వరలోనే వారికి కూడా అందజేస్తామని పేర్కొన్నారు.



పాములపాడులో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు

మహానంది: శ్రీ గంగా, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు స్వామి,అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతుల అనంతరం ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేపట్టారు. వివిధ ప్రాంతాల భక్తులు ఉత్సవంలో పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.



మహానందిలో పల్లకీ సేవ దృశ్యం

ఓటర్ల సర్వే పకడ్బందీగా చేపట్టండి

జూపాడుబంగ్లా: బీఎల్‌ఓలు ఓటర్ల జాబితా సర్వే పకడ్బందీగా చేపట్టాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు సూచించారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఎల్‌ఓలు వారికి కేటాయించిన ఓటరు జాబితా ప్రకారంగా ఇంటింటికి వెళ్లి వివరాలు తెలుసుకోవాలన్నారు. ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు పక్కాగా చేయాలన్నారు. చనిపోయిన వారి పేర్లు, గ్రామాల్లో లేకుండా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారి పేర్లు ఓటరు జాబితాలో ఉన్నట్లయితే కుటుంబ సభ్యుల నుంచి అంగీకారపత్రం తీసుకొని వారి పేర్లను జాబితానుంచి తొలగించాలని తెలిపారు. ఆగస్టు 23 నాటికల్లా ఓటరు జాబితా వ్యారిఫికేషన్ పూర్తిచేయాలన్నారు.



బీఎల్‌ఓలకు అవగాహన కల్పిస్తున్న ఆర్డీఓ దాసు

ఓటరుగా నమోదు పై సర్వే

పాములపాడు: మండల కేంద్రంలో ఓటరు నమోదుపై బీఎల్వోలు శుక్రవారం సర్వే చేపట్టారు. గ్రామంలోని ప్రతి ఇంటిని వారు సందర్శించారు. 18 సంవత్సరాలు పైబడిన ప్రతి యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని సూచించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు



గాయపడిన పావని

పగిడ్యాల: బంధువులను చూసేందుకు కుటుంబ సమేతంగా వచ్చిన ఓ మహిళ తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదనికి గురై గాయాల బారినపడిన ఘటన శుక్రవారం పగిడ్యాల–నందికొట్కూరు రోడ్డుపై బీరవోలు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన పావని పగిడ్యాలలోని బంధువుల ఇంటికి కుమారుడు, కుమార్తెతో కలిసి బైక్‌పై వచ్చారు. బంధువైన వేణయ్య ఇంటి వద్ద కొంత సేపు గడిపి మధ్నాహ్నం స్వగ్రామం బయలుదేరారు. మార్గమధ్యంలో జయరాఘవనాయుడు పొలం వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్‌ను గమనించని కుమారుడు బైక్‌ను స్పీడుగా పోనివ్వడంతో బైక్ అదుపుతప్పి కింద పడి గాయాలయ్యాయి. 108 వాహనంలో నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

మహానంది: బండిఆత్మకూరు మండలం సంతజూటూరు గ్రామంలో రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. గ్రామానికి చెందిన డి.మౌలాలి, శ్రీనివాసరెడ్డి మధ్య ఘర్షణ చోటుచేసుకోగా.. ఇరువర్గాలకు చెందిన వారు గాయపడ్డారన్నారు. శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై, మౌలాలి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు చెప్పారు.

బైక్‌లు సీజ్

నందికొట్కూరు: పట్టణ సమీపంలోని శ్లోక హైస్కూల్ వెనుక పరిసరాల్లోని ముళ్లపొదల్లో వదిలేసిన బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ ఎన్వీ రమణ శుక్రవారం తెలిపారు. ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు శ్లోక హైస్కూల్ వెనుక పరిసర ప్రాంతాన్ని పరిశీలించగా. పాడుపడిన ఆరు మోటారు సైకిళ్ల కనిపించడంతో పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. తగిన ఆధారాలతో నందికొట్కూరు పోలీసు స్టేషన్‌లో సంప్రందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పొలం కాల్వలోకి దూసుకెళ్లిన ట్రాలీ ఆటో, గాయపడిన వ్యక్తి

మహానంది: తిమ్మాపురం నుంచి బుక్కాపురం వెళ్లే మార్గంలో ఐషర్ ట్రాలీ ఆటో, స్కూటర్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. నంద్యాల పట్టణానికి చెందిన ట్రాలీ ఆటో బుక్కాపురం వెళ్తూ రోడ్డుపక్కనున్న స్కూటర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో పొలాల్లోని పంటకాల్వలో పడింది. ఆటోలో ఉన్న మహానంది మండలం అబ్బీపురం గ్రామానికి చెందిన విద్యుత్ పనులు చేసుకునే వెంకటేశ్వర్లు, నంద్యాలకు చెందిన మరొకరు గాయపడ్డారు. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై ఎలాంటి కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి

మిడుతూరు: భారతీయ సనాతన ధర్మాన్ని కాపాడుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని జయదేవానంద స్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని గుడిపాడు గ్రామంలో గో పూజ, కుంకుమార్చన తదితర విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామిజీ మాట్లాడుతూ సనాతన హిందూ ధర్మాన్ని, భారతీయ సంస్కృతిని సంప్రదాయాలను భావి తరాలకు అందించాల్సిన ఆవశ్యకతను వివరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ కార్యనిర్వాహకులు మల్లు వెంకటరెడ్డి, గ్రామ పెద్ద కొప్పుల శంకర్ రెడ్డి, అర్చకులు చిదంబరయ్య, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.



సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రఘువీర్ రెడ్డి

నంద్యాలటౌన్: పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి చెప్పారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న 11మంది సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి ఎస్పీకి విన్నవించుకోగా తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా ఇచ్చారు. అడిషనల్ ఎస్పీ అడ్మిన్ జి.వెంకట రాముడు, సీసీ నాగరాజు పాల్గొన్నారు.

నష్టపరిహారం కోసం 13 దరఖాస్తులు

కొత్తపల్లి: మండలంలో గత వారం ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఆయా గ్రామాల్లో మట్టిమిద్దెలు కూలిపోయాయి. వాటికి నష్టపరిహారం కోరుతూ 13 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న శుక్రవారం తెలిపారు. కొక్కెరంచ–1, ఎదురుపాడు–1, ఎర్రమఠం–1, గువ్వలకుంట్ల–3, కొత్తపల్లి మండల కేంద్రంలో 7 మంది మట్టిమిద్దెలు కూలాయని దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తులను ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు.